మార్పు కోసం ...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

## భారత్ 'రూపాయి' ఇండోనేషియాలో చెల్లుబాటు

### భారత్, ఇండోనేషియా

### కేంద్ర బ్యాంకుల మధ్య ఒప్పందం

**న్యూఢిల్లీ,మార్చి8( మరో ఉదయం):**

అంతర్జాతీయ వాణిజ్యంలో స్థానిక కరెన్సీల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు భారత్, ఇండోనేషియా కేంద్ర బ్యాంకుల మధ్య ఒప్పందం కుదిరింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంత దాస్, బ్యాంక్ ఇండోనేషియా గవర్నర్ పెర్రీ వార్జియో ఎంఓయూపై సంతకాలు చేశారు.ఈ ఒప్పందం భారతదేశంలోని సంస్థలు, ఇండోనేషియాలోని సంస్థల మధ్య వ్యాపారం చేసేటప్పుడు భారతీయ రూపాయి, ఇండోనేషియా రూపాయికరెన్సీని ఉపయోగించడాన్ని ప్రోత్సహించడం.రెండు దేశాల నుండి ఎగుమతిదారులు వారి స్థానిక కరెన్సీలో ఇన్వాయిస్ చేయవచ్చు.

ప్రచురణ: అనంతపురం సంపుటి:13 సంచిక : 249 శనివారం 09.03.2024 పేజీలు 4 వెల 2.00 సర్క్యులేటెడ్ బై . విజయవాడ. అనంతపురం. కర్నూలు. కడప. సత్యసాయి. అన్నమయ్య రాయచోటి. చిత్తూరు. తిరుపతి. నంద్యాల.

## మహిళా దినోత్సవ ఘనత

### రాజ్యసభకు సుధామూర్తి

### నామినేట్ చేసిన రాష్ట్రపతి ముర్ము

### శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,మార్చి8( మరో ఉదయం):**

ప్రముఖ విద్యావేత్త, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి సతీమణి సుధామూర్తి రాజ్యసభకు నామినేట్ అయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సుధామూర్తిని ఎగువ సభకు నామినేట్ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ మేరకు సుధామూర్తికి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. సుధామూర్తి రాజ్యసభకు నామినేట్ కావడం సంతోషకరమైన విషయమన్నారు. సామాజిక సేవలో సుధామూర్తిది స్ఫూర్తిదాయక ముద్ర అని కొనియాడారు. సామాజిక సేవ, దాతృత్వం, విద్య సహా విభిన్న రంగాలకు సుధా జీ చేసిన కృషి అపారమైనదని ప్రశంసించారు. సుధామూర్తి లాంటి వ్యక్తి రాజ్యసభలో ఉండటం నారీ శక్తికి ఒక శక్తివంతమైన నిదర్శనం అని కొనియాడారు. ఎగువ సభకు నామినేట్ అయిన సుధామూర్తికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రపతి కోటాలో ఆమె పెద్ద సభలో అడుగు పెట్టబోతున్నారు. సామాజిక సేవ, దాతృత్వం, విద్యతో సహా విభిన్న రంగాలకు సుధా మూర్తి చేసిన కృషి అపారమైనదని ప్రధాని మోదీ కొనియాడారు. మన దేశం విధిని రూపొందించడంలో మహిళల శక్తి, సామర్థ్యాన్ని ఉదాహరణగా చూపుతుందన్నారు. ఆమెకు ఫలవంతమైన పార్లమెంటు పదవీకాలం కావాలని ఆకాంక్షించారు ప్రధాని మోదీ. ఒక ఉపాధ్యాయురాలుగా ప్రస్థానం ప్రారంభించిన సుధామూర్తి ఇన్ఫోసిస్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. ఆమె భర్త ఎన్ఆర్ నారాయణ మూర్తి ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు. సుధా మూర్తి రచయిత, దాతృత్వాన్ని నమ్ముతారు.

# నాకు ఇవే చివరి ఎలక్షన్స్..



### మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని వెల్లడి

**అమరావతి,మార్చి7(మరో ఉదయం):**

నాకు ఇవే చివరి ఎన్నికలు అంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని వెల్లడించారు. 2029 ఎన్నికల్లో పోటీ చేయడం లేదని పేర్కొన్నారు. నా కూతుళ్ళకు రాజకీయాలలో ఆసక్తి లేదు.. రాజకీయాలలో ఆసక్తి ఉంటే నా తమ్ముడి కొడుకు వస్తాడేమో అని తెలిపారు. నాకు ఇప్పుడు 53 ఏళ్లు వచ్చాయి.. ఇప్పుడు గెలిస్తే 58 ఏళ్ల వరకు పదవిలో ఉంటా.. ఆ వయసులోమళ్లీ పోటీ చేయలేను అంటూ కొడాలి నాని తెలిపాడు.ఇక, అంతకు ముందుకు.. రాబోయే ఎన్నికల్లో 'చంద్రబాబు అండ్ కో'ను గోతిలో పాతి పెట్టాలని కొడాలి నాని అన్నారు. సీనియర్ ఎన్టీఆర్, జూనియర్ ఎన్టీఆర్ లను గుండెల్లో పెట్టుకుని అభిమానించే ప్రతి ఒక్కరూ.. పందుల్లా వస్తున్న చంద్రబాబు, ఆయన మిత్రులకు తగిన బుద్ధి చెప్పాలని తెలిపాడు. నారా లోకేశ్ ను గెలిపిస్తే సీనియర్ ఎన్టీఆర్ మాదిరి జూనియర్ ఎన్టీఆర్ ను బయటకు గెంటేసి టీడీపీని ఆక్రమించుకుంటారని ఆయన వెల్లడించారు. లోకేశ్ ను ముఖ్యమంత్రిని చేసేందుకే జూనియర్ ఎన్టీఆర్ పై అనేక కుట్రలు చేస్తూ, తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని కొడాలి నాని మండిపడ్డారు. ఇక, పేద ప్రజలకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఎంతో చేస్తున్నారన్నారు. 120 సార్లు బటన్ నొక్కి పేద ప్రజలకు రూ. 2.50 లక్షల కోట్లను అందించిన జగన్ కోసం ఈవీఎంలలో ఫ్యాన్ గుర్తుపై నొక్కాలని పిలుపునిచ్చారు. ఎంత మంది ఏకమై వచ్చినా జగన్ ను ఓడించలేరని పేర్కొన్నారు. వైసీపీ రెండోసారి ఘన విజయం సాధించబోతోందని మాజీమంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని ధీమా వ్యక్తం చేశారు.

## 2029 ఎన్నికల్లో పోటీ చేయను

## బెంగాల్‌లో మహిళలంతా సురక్షితమే

### ర్యాలీలో ముఖ్యమంత్రి మమత సందేశం

**బెంగాల్,మార్చి7( మరో ఉదయం):**



గత కొద్ది రోజులుగా సందేశ్‌ఖాలీ ఘటనతో పశ్చిమబెంగాల్‌అట్టుడుకుంది. తృణమూల్ కాంగ్రెస్ నేత షాజహాన్, అతని మద్దతుదారులు భూకబ్జాలు, లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అనంతరం బీజేపీకి కూడా వారికి మద్దతుగా నిరసనలు చేపట్టింది. ఇక ప్రధాని మోడీ ఇటీవల బెంగాల్ పర్యటనలో సందేశ్‌ఖాలీ ఘటనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మమత సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి అండతోనే షాజహాన్ రెచ్చిపోయారని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా బాధిత మహిళలు కూడా మోడీని కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకుని ఆవేదన చెందారు. వారి మాటలు విన్న ప్రధాని కూడా కలత చెందారు. ఈ పరిణామాల నేపథ్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి మమత.. భారీ ఎత్తున మహిళలతో కలిసి కోల్‌కతాలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మమత మాట్లాడుతూ.. బెంగాల్‌లో ఉన్న మహిళలంతా సురక్షితంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించినప్పుడు వారంతా ఎక్కడికెళ్లారని ప్రశ్నించారు. అలాగే హాథ్రస్‌లో ఒక అత్యాచార బాధితురాలి మృతదేహానికి బలవంతంగా అంత్యక్రియలు నిర్వహించినప్పుడు ఎక్కడున్నారని నిలదీశారు. బిల్కిస్ బానోని మరిచిపోయారా? అంటూ బీజేపీపై మమత విమర్శలు గుప్పించారు. తమ రాష్ట్రంలో మహిళలు అత్యంత సురక్షితంగా ఉన్నారని మమత చెప్పుకొచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ర్యాలీలో సందేశ్‌ఖాలీ ప్రాంతానికి చెందిన మహిళలూ పాల్గొన్నట్లు సమాచారం.

## చంద్రబాబు మహాదోపిడీకి

# హైకోర్టు అవాక్కయ్యింది

### అయినా ఈ వార్తను ఎల్లో మీడియా ప్రచురించలేదు

### క్లాసికల్ దోపిడీ చేయగల దిట్ట చంద్రబాబు

### ఐఎంజీతో సంబంధం లేకుండా 850 ఎకరాల ధారాదత్తం

### అంతర్జాతీయ స్కామ్ స్టర్ చంద్రబాబు

### వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల ధ్వజం



**అమరావతి,మార్చి8(మరో ఉదయం):**

మిగతా 2 లో

# బీజేపీ అగ్రనేతలతో చంద్రబాబు, పవన్ భేటీ రేపటికి వాయిదా

### ఏపీలో టీడీపీ-జనసేన మధ్య పొత్తు

### బీజేపీని కూడా పొత్తుకు ఆహ్వానిస్తున్న వైనం

### నిన్న రాత్రి అమిత్ షా, జేపీ నడ్డాలతో

### చంద్రబాబు, పవన్ సమావేశం

### నేడు మరోసారి సమావేశం కావాలని భావించిన నేతలు

### అమిత్ షా, నడ్డాలకు సమయం

### కుదరకపోవడంతో భేటీ వాయిదా



టీడీపీ-జనసేన కూటమిలోకి బీజేపీని కూడా కలుపుకోవాలన్న ఉద్దేశంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ నిన్నటి నుంచి ఢిల్లీలో మకాం వేసిన సంగతి తెలిసిందే. గతరాత్రి పొద్దుపోయాక అమిత్ షా, జేపీ నడ్డాలను కలిసిన చంద్రబాబు, పవన్ అర్ధరాత్రి వరకు చర్చలు జరిపారు. ఇవాళ కూడా సమావేశమవ్వాలని ఇరు పార్టీల నేతలు నిర్ణయించారు. అయితే, ఇవాళ్టి సమావేశం వాయిదా పడింది. అమిత్ షా, జేపీ నడ్డాలకు సమయం కుదరకపోవడంతో నేడు సమావేశమయ్యేందుకు సాధ్యపడలేదు. దాంతో రేపు సమావేశం కావాలని నిర్ణయించారు. అమిత్ షా రేపు పాట్నా వెళ్లనుండగా, ఆ పర్యటనకు ముందు కలిసేందుకు చంద్రబాబు, పవన్ లకు ఆయన అపాయింట్ మెంట్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రేపు కూడా చంద్రబాబు, పవన్ ఢిల్లీలోనే ఉంటారని తెలుస్తోంది.

## ఫిలిప్పీన్స్, అండమాన్ సముద్రంలో భూకంపం

### రిక్టర్ స్కేలుపై 6.0 తీవ్రత నమోదు

**ఫిలిప్పీన్స్,మార్చి8( మరో ఉదయం):**

ఫిలిప్పీన్స్‌లోని మిండానావో, అండమాన్ సముద్రం లో భారీ భూకంపం సంభవించినట్లు తెలుస్తోంది. ఫిలిప్పీన్స్‌లోని మిండానావోలో శుక్రవారం రిక్టర్ స్కేలుపై 6.0 తీవ్రతతో భూకంపం సంభవించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. 140 కి.మీ దూరంలో ఈ భూకంపం సంభవించినట్లుగా అధికారులు పేర్కొన్నారు. ఇక అండమాన్ సముద్రంలో కూడా 4.3 తీవ్రతతో భూకంపం వచ్చినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. ఈ భూకంప సంఘటన మార్చి 8, 2024న 13:07:41 దగ్గర సంభవించినట్లుగా పేర్కొంది. 140 కి.మీ దిగువన ఈ భూకంపం సంభవించినట్లుగా తెలిపింది. హిందూ మహాసముద్రం యొక్క ఈశాన్య భాగంలో ఉన్న అండమాన్ సముద్రం.. టెక్టోనిక్ ప్లేట్ సరిహద్దులకు సమీపంలో ఉండటం వల్ల తరచుగా ఈ భూప్రకంపనలకు లోనవుతోంది. ఇదిలా ఉంటే భూకంపం తర్వాత సముద్రపు అలలు తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున అండమాన్ సముద్ర ప్రాంతంలోని నివాసితులు అప్రమత్తంగా ఉండాలని.. అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఇక ఫిలిప్పీన్స్‌లోని మిండానావోలో 08-03-2024న 14:41:47 నిమిషాలకు భూకంపం సంభవించింది. ప్రస్తుతం దీని తీవ్రత 6.0గా నమోదైంది. దీనికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు





## వేకువజామునుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తులు

### అభిషేకాలు, లింగార్చనలు నిర్వహణ

### వేయిస్తంభాల గుడిలో కిషన్ రెడ్డి పూజలు

**విజయవాడ/హైదరాబాద్,మార్చి8 (మరో ఉదయం):**

తెలుగు రాష్ట్రాల్లో శివరాత్రి శోభతో ఆలయాలు కిటకిటలాడుతున్నాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే శివయ్య దర్శనానికి పోటెత్తారు. శివరాత్రి పండుగ సందర్భంగా ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శ్రీశైలం, శ్రీకాళహస్తి, వేములవాడ, కీసర రామలింగేశ్వర ఆలయం, వేయిస్తంభాల గుడి, కోటిపల్లి, ద్రాక్షారామం, కాళేశ్వరం, కొమురవెల్లి, కొడ్వటూరు, చెర్వుగట్టు లింగమంతుల ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. శివయ్యకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గోదావరి నదీ తీరాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. శ్రీకాళహస్తి ఆలయంలో గురువారం అర్ధరాత్రి దాటాక భక్తులను దర్శనానికి అనుమతించారు. శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. శ్రీశైలంలో నేడు పాగాలంకరణ, కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. శివనామస్మరణతో శ్రీగిరి క్షేత్రం మార్మోగుతోంది. మరోవైపు, మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు సైతం వైభవంగా సాగుతున్నాయి. ఈ నెల 11 వరకూ ఈ ఉత్సవాలు సాగనున్నాయి. శ్రీశైలంలో స్వామి, అమ్మవార్ల దర్శనానికి 4 గంటల సమయం పడుతోంది. శుక్రవారం రాత్రి 12 గంటలకు స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు. ఏపీలోని బాపట్ల జిల్లా చినగంజాం మండలం సోపిరాల, కొత్తపాలెం శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి దర్శనానికి ఉదయం నుంచే పోటెత్తారు. అటు, కోనసీమ జిల్లాలోని పంచారామ క్షేత్రం ద్రాక్షారామంలో భక్తుల రద్దీ నెలకొంది. కాకినాడ జిల్లా సామర్లకోటలోని శ్రీ చాళుక్య కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ లోని వెయ్యి స్తంభాల ఆలయంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి రుద్రేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేయి స్తంభాల కళ్యాణ మండపంలో నిర్వహించిన శివపార్వతుల కళ్యాణ మహోత్సవంలో కిషన్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. సుమారు 17 ఏళ్ల తర్వాత వేయిస్తంభాల గుడి కళ్యాణ మండపాన్ని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అటు, వేములవాడ రాజన్న సన్నిధి భక్త జన సంద్రంగా మారింది. మూడు రోజుల జాతర సందర్భంగా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గురువారం సాయంత్రం తితిదే స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించింది. వరంగల్ నగరంలోని సిద్ధేశ్వరాలయం, కురవి వీరభద్రేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. అయినవోలు మల్లికార్జున స్వామి ఆలయం, పాలకుర్తి సోమేశ్వరాలయాల్లోనూ భక్తుల రద్దీ నెలకొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో ఉదయం నుంచే స్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించి గోదారి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నల్గొండ జిల్లాలోని పానగల్లు ఛాయా, పచ్చల సోమేశ్వర ఆలయాల్లోనూ భక్తులు స్వామిని దర్శించి మారేడు దళాలతో పూజించారు. సూర్యాపేట పిల్లలమర్రి, మేళ్లచెర్వు స్వయంభు శంభు లింగేశ్వర ఆలయాల్లో శివరాత్రి శోభ సంతరించుకుంది. చెర్వుగట్టు పార్వతీజడల రామలింగేశ్వర స్వామి, వాడపల్లి అగస్తేశ్వర స్వామి ఆలయాల్లోనూ ఉదయం నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని గుంటి మల్లన్న, తీర్థాల, కూసుమంచి, పెనుబల్లి, మధిరల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

## శివనామంతో మార్మోగిన శ్రీశైలం

### భారీగా తరలివచ్చిన శివభక్తులు

### స్వామిదర్శనం కోసం నిండిన క్యూలైన్లు

### వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు

**నంద్యాల,మార్చి8(మరో ఉదయం):**

శ్రీశైలం పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైలం ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామి అమ్మవార్ల దర్శనానికి తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూ లైన్లలో బారులు తీరారు. దైవ దర్శనాని కి సుమారు 6గంటల సమయం పడుతోంది. శివనామస్మరణతో శ్రీశైలం ఆలయం మార్మోగుతోంది. భక్తుల తో ఆలయ క్యూలైన్లుకిక్కిరిసి పోయాయి. శివస్వాములతో ప్రత్యేక క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులు వేకువ జామున నుంచి పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకుంటున్నారు. కాగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం స్వామి అమ్మవార్లు నందివాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు. సాయంత్రం నందివాహనంపై స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రదక్షిణ, స్వామి అమ్మవార్లకు ప్రభోత్సవం నిర్వహించనున్నారు. రాత్రి పదిగంటలకు ఆలయంలో నవనందుల పాగాళంకరణ అనంతరం స్వామి అమ్మవార్ల కళ్యాణం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా భక్తులు భారీగా తరలి రానున్నారు. దీని కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో పెద్దిరాజు తెలిపారు. 9న రథోత్సవం, తెప్పోత్సవం కార్యక్రమాలు జరగనున్నాయి. 10న ధ్వజావరోహణం..11న అశ్వవాహనసేవ, పుష్పోత్సవం, శయనోత్సవం కార్యక్రమాలతో శివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. కాగా మహానంది, యాగంటి, ఓంకారం, కాల్వబుగ్గ క్షేత్రాల్లో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు జరుగుతున్నాయి. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శివరాత్రి కారణంగా దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు.



## దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలు

### వై.ఎఫ్.సి.ఏ.జంట నగరాల అధ్యక్షులు దంపనబోయిన శ్రీనివాస్.

**మరో ఉదయం ప్రతినిధి మార్చి 8 (కుత్బుల్లాపూర్):-**

దేవాలయాలు ప్రశాంతతకు నిలయాలని ఆధ్యాత్మికతతోనే శాంతి సమాజం నెలకొంటుందని వై.ఎఫ్.సి.ఏ. జంట నగరాల అధ్యక్షులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం శెట్టిబలిజ సంఘం సలహాదారులు,సంఘ సేవకులు దంపనబోయిన శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గాజుల రామారం డివిజన్ మహదేవపురం ప్రాంతం సమీపంలోని చీకటిగుట్ట లోని శ్రీ భక్త వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న శివాలయంలో ఆయనతోపాటు పలువురు సంఘ సేవకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహకులు వెంకటరెడ్డి, సంఘ సేవకులు,బిల్డర్ రమేష్, ద్వారకా నగర్ జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు...



## కాంగ్రెస్ నేత బండి రమేష్ పై విమర్శలా...

### సతీష్ అరోరా అక్రమ నిర్మాణాలను వెలికితీస్తాం...

### కోట్లకి ఎలా పడిగెత్తాడో తేలుస్తాం....

### కూకట్ పల్లి బీఆర్ఎస్ నియోజకవర్గం కోఆర్డినేటర్ రెడ్డి

### సతీష్ ఆరోరాకు బహిరంగ సవాల్....

**మరో ఉదయం ప్రతినిధి, కూకట్పల్లి**



తెలంగాణ ద్రోహి సతీష్ అరోరా ఉద్యమకారులను వేధించి ఎమ్మెల్యేని అడ్డం పెట్టుకొని కోట్లాది రూపాయలు సంపాదించలేదా దమ్ముంటే బహిరంగ చర్చకు సిద్ధమా అని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి సవాల్ విసిరారు. కూకట్ పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ కోఆర్డినేటర్ పేరుతో నియోజకవర్గంలోని కార్పొరేటర్లను డమ్మీగా చేసి అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తూ కోట్లాది రూపాయలు సంపాదించారని ఆరోపించారు. రెడ్డి సతీష్ అరోరా, కూకట్ పల్లి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన బండి రమేష్ పై విమర్శలు చేసే అంత ఆయ్యావా అని ప్రశ్నించారు. కూకట్ పల్లి జోనల్ పరిధిలో అధికారులను బెదిరించి వేలాది మంది బిల్డర్లు, బిల్డింగ్ నిర్మాణదారుల వద్ద కోట్లాది రూపాయలు వసూలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. రెడ్డి సతీష్ అరోరా అధికారాన్ని అడ్డం పెట్టుకొని రక్తం తాగిన విధంగా అమాయకులను బెదిరించి పీల్చి పిప్పి చేశారని ఆరోపించారు. నీలో తెలంగాణ రక్తం ప్రవహిస్తే తెలంగాణ అమరవీరుల స్తూపం వద్దకు వచ్చి తెలంగాణ ఉద్యమకారులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలోనే సతీష్ అరోరా నియోజకవర్గంలో చేసిన ఆగడాలు అక్రమాలపై చార్జీషీట్ విడుదల చేస్తామని, బాధ్యులైన అధికారులపై సైతం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతామని శేరి సతీష్ రెడ్డి హెచ్చరించారు.

## తెలంగాణ భవన్‌లో మహిళాదినోత్సవ వేడుకలు

**హైదరాబాద్,మార్చి8(మరో ఉదయం):**

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునితా లక్ష్మారెడ్డి, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.. తెలంగాణ ఆడబిడ్డలందరికి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళల అభ్యున్నతికి కేసీఆర్ కృషి చేశారని తెలిపారు. సమ్మక్క, సారలమ్మ, రుద్రమదేవిలా మహిళలు పోరాటం చేయాలన్నారు.

## మహిళలకు సిఎం రేవంత్ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు

**హైదరాబాద్,మార్చి8(మరో ఉదయం):**

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా పాలనలో మహిళల ప్రాతినిధ్యం, భాగస్వామ్యం గణనీయంగా పెరిగిందన్నారు. అన్ని రంగాల్లో మహిళలను అభివృద్ధి, ప్రగతి పథంలో తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపడుతున్నదని చెప్పారు. మహిళల సాధికారితతో పాటు ఆర్థిక స్వాలంబనకు మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, ఇంటింటికీ రూ.500 గ్యాస్ సిలిండర్ గ్యారంటీలను కొత్త ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని అన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు, సమాన హక్కులు దక్కాలని సీఎం ఆకాంక్షించారు. మహిళల అభ్యున్నతి లక్ష్యంగా రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల ద్వారా త్వరలోనే మరిన్ని వినూత్న కార్యక్రమాలను చేపడుతామన్నారు. మహిళలకు అండగా ఉండేలా తమ ప్రభుత్వం మరిన్ని కొత్త పథకాలు అందుబాటులోకి తెస్తుందని అన్నారు. మహిళా సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం తప్పకుండా దేశమందరి దృష్టిని ఆకర్షిస్తుందనే నమ్మకం తనకు ఉందన్నారు.

## అభివృద్ధికి పెద్దపీట వేసిన కెసిఆర్

### వ్యవసాయానికి ప్రాధాన్యం ఇచ్చాం

### ఇప్పుడేమో తిరోగమన చర్యలు: వేముల

**నిజామాబాద్,మార్చి8(మరో ఉదయం):**

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తిరోగమన చర్యలతో తెలంగాణ పురోగతని అడ్డుకుంటున్నారని బాల్‌ఒండ బిఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అభిప్రాయపడ్డారు. కెసిఆర్ గతంలో అన్నిరంగాల్లో ప్రగతని చూపినా, ఆరంగాలను పూర్తిగా విస్మరించి, విమర్శలతో కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఏర్పడ్డ తరవాత కెసిఆర్ కృషి ఫలితంగా పదేళ్ల కాలంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం...అభివృద్ధి, సంక్షేమం వైపు వడివడిగా అడుగులు వేసిందని అన్నారు. బడ్జెట్లో వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయగా, ఇందులో సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు పెంచారు. ప్రత్యేకంగా దళితబంధు పథకం, బీసీ, మైనార్టీ, బ్రాహ్మణ, గౌడ, మహిళలకు సంక్షేమ పథకాల కొనసాగింపు వంటివి ప్రజలకు మేలు చేకూర్చాయి. సాగు, సంక్షేమంలో ముందుకు తీసుకుని వెళ్లామని వేముల ప్రశాంత రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతులకు ఊరట కలిగించేందుకు ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలు చేసిందని అన్నారు. గొల్ల, కురుమలను ఆదుకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 2017 లో సబ్సీడీ గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. అదేవిదంగా పశుసంవర్థకశాఖలోని పలు పథకాలు, మత్స్య శాఖకు చెందిన పథకాలకు సైతం నిధుల కేటాయింపు జరిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధన, మహిళా, అటవీ విశ్వవిద్యాలయాలతో జిల్లాకు సైతం ప్రయోజనం చేకూరింది. కెసిఆర్ అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యత నిచ్చారు. సాగు, తాగునీటి రంగాలకు నిధుల కేటాయింపు పెరిగిందని వేముల అన్నారు. మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం ఇచ్చామని అన్నారు. అయితే కాళేశ్వరాన్ని ఎండబెట్టి చుక్కనీరు రాకుండా చేయడంతో ఇప్పుడు సాగునీటి, తాగునీటి కష్టాలు మొదలయ్యాయని అన్నారు.

## బిజెపి ముఖ్యనేతలతో మాధవీలత భేటీ

### హైదరాబాద్‌లో సహకరించాలని వినతి

**హైదరాబాద్,మార్చి8(మరో ఉదయం):**


హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి మాధవీలత సైదాబాద్‌లో పార్టీ ముఖ్యనేతలను కలిశారు. అండగా నిలిచి పార్టీ విజయానికి సహకరించాలని ఆమె కోరారు. భాగ్యనగర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీలను నివాసాలకు వెళ్లి కలిశారు. డివిజన్ ముఖ్య నేతలను పిలిపించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాధవీలతను సత్కరించారు. చాదర్‌ఘాట్: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి మాధవిలతను కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డితో కూడిన బృందం శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మోదీ గ్యారెంటీ పథకాలతో ప్రజల్లోకి ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించి మాధవిలత విజయం కోసం తమ వంతు కృషి చేస్తానని వెల్లడించారు.కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కొప్పుల దినేష్,నాయకులు తుమ్మలపల్లి రమే?షరెడ్డి, బొక్క మధుసూదన్‌రెడ్డి, మందడి సందీ?పరెడ్డి పాల్గొన్నారు.



## కూకట్పల్లిలో ఘనంగా మహాశివరాత్రి వేడుకలు ప్రత్యేక పూజలు పాల్గొన్న ఎమ్మెల్యేలు కార్పొరేటర్లు...

**మరో ఉదయం ప్రతినిధి, కూకట్పల్లి**


మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కూకట్పల్లి నియోజకవర్గంలో వివిధ ఆలయాల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు,కార్పొరేటర్లు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, పండాల సతీష్ గౌడ్ ,మందడి శ్రీనివాస్ రావు, ఆవుల రవీందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు,డివిజన్ అధ్యక్షులు సంతోష్, అంబటి శ్రీనివాస్ , నాయకులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## సోదరుడు తిరుపతిరెడ్డిని పరామర్శించిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి8(మరో ఉదయం):**

గుండెపోటుతో మాదాపూర్ మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన సోదరుడు తిరుపతి రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి పరామర్శించారు. తిరుపతి రెడ్డ ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. గురువారం తిరుపతిరెడ్డికి గుండెపోటు రావడంతో చికిత్స కోసం మాదాపూర్ మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. తిరుపతిరెడ్డికి యాంజియోగ్రామ్ చేసిన వైద్యులు.. గుండె రక్తనాళాల్లో బ్లాక్స్ ఉన్నాయని గుర్తించారు. వెంటనే ఆయను స్టంట్స్ వేశారు. ప్రస్తుతం తిరుపతి రెడ్డి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. రానున్న రోజుల్లో లోక్ సభ ఎన్నికల్లో మల్కాజ్ గిరి ఎంపీ అభ్యర్థిగా సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు అయిన తిరుపతిరెడ్డి పోటీ చేస్తారని గత కొన్ని రోజులుగా ప్రచారం సాగుతోంది. దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ తిరుపతిరెడ్డి పేరుతో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో ఈ ప్రచారం ఊపందుకుంది. ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ బాధ్యతలను తిరుపతి రెడ్డి చూసుకుంటున్నారు.అయితే ఎన్నికల్లో తన సోదరులు ఎవరూ పోటీ చేయరని సిఎం ఇప్పటికే ప్రకటించారు.



# కామెడీ టైమింగే నన్ను ఆకట్టుకుంది

## భర్త జాకీ భగ్నానీపై రకుల్ ప్రీత్ కామెంట్

వివాహమైన తర్వాత తొలిసారి తన భర్త జాకీ భగ్నానీ గురించి మాట్లాడారు నటి రకుల్ ప్రీత్ సింగ్ . అస్సాం వేదికగా జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న జాకీ తనకు సెన్స్ ఆఫ్ హ్యూమర్ చాలా ఎక్కువని చెప్పగా, పక్కనే ఉన్న రకుల్ అది నిజమేనన్నారు. ఆయన్ని పొగడ్తలతో ముంచెత్తారు. 'జాకీ మంచి మనసు, హాస్య చతురత కలిగిన వ్యక్తి. అతడిలోని కామెడీ టైమింగే తొలుత నన్ను ఆకర్షించింది. తను ఎప్పుడూ సరదాగా ఉంటాడు. చుట్టూ ఉన్నవాళ్లు సంతోషంగా ఉండేలా చూస్తాడు' అని ఆమె అన్నారు. కన్నడ చిత్రం 'గిల్లీ'తో తెరంగేట్రం చేసిన రకుల్ హిందీ పరిశ్రమలో ఇటీవల దశాబ్దకాలం పూర్తి చేసుకున్నారు. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన సమయంలో కామన్ ఫ్రెండ్స్ వల్ల బాలీవుడ్ నిర్మాత జాకీ భగ్నానీతో ఆమెకు పరిచయం ఏర్పడింది. గత మూడేళ్ల నుంచి వీరిద్దరూ ప్రేమలో ఉన్నారు. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో ఫిబ్రవరి 21న వీరి పెళ్లి జరిగింది. గోవాలోని ఓ ప్రముఖ రిసార్ట్స్‌లో జరిగిన వివాహ వేడుకల్లో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారు. వివాహం అనంతరం ఇటీవల అస్సాం టూర్‌కు వెళ్లారు. అక్కడి ప్రముఖ దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అస్సాం స్టేట్ ఫిల్మ్ కార్పొరేషన్ లిమిటెడ్ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సినిమా వార్తలు

# నాగసాధువులా తమన్నా



ఓటీటీ చిత్రం 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్ అయిన 'ఓదెల 2'చిత్రం ఇటీవలే కాశీలో గ్రాండ్‌గా ప్రారంభమైంది. అశోక్ తేజ దర్శకత్వంలో సంపత్ నంది క్రియేటర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్ బ్యానర్‌లపై డి మధు హై బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని, ఈ చిత్రంలో శివశక్తి పాత్రలో నటిస్తున్న తమన్నా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాత్ర కోసం తమన్నా కంప్లీట్‌గా ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. నాగ సాధువులా వేషం ధరించి.. ఒక దండము, మరో చేతిలో ఢమరుకం, నుదుటిపై పసుపు బొట్టు, దానిపై కుంకుమ బిందువుతో శివశక్తిగా అద్భుతం అనేలా తమన్నా దర్శనమిస్తోంది. కాశీ ఘాట్‌లపై నడుస్తూ, ఆమె కళ్ళు మూసుకుని దేవుడిని ప్రార్థిస్తూ కనిపిస్తున్నారు. తమన్నా విషయంలో ఇది అన్ బిలివబుల్ మేకోవర్ అనే చెప్పుకోవాలి. ఈ ఏజ్ హీరోయిన్లలో ఏ హీరోయిన్ కూడా ఇలా కనిపించింది లేదు. ఈ ఫస్ట్‌లుక్ అందరినీ ఆకట్టుకుంటూ.. శివరాత్రికి ఇది పర్ఫెక్ట్ ట్రీట్ అనేలా ఉంది. ఓదెల 2 గ్రామం చుట్టూ కేంద్రీకృతమై, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఓదెల మల్లన్న స్వామి తన గ్రామాన్ని దుష్ట శక్తుల నుండి ఎలా రక్షిస్తాడనే అంశాలతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహా ముఖ్య తారాగణం. ÷ఎఈచీ సినిమాలో టాప్ క్లాస్ ఉండబోతున్నాయని, 'ఓదెల 2' కోసం ప్రముఖ సాంకేతిక నిపుణులు పని చేయబోతున్నారని మేకర్స్ తెలుపుతున్నారు. యూనివర్సల్ అప్పీల్ ఉండే ఈ సినిమా నేషనల్ వైడ్‌గా విడుదల కానుందని మేకర్స్ తెలియజేశారు. కాగా.. సౌందర్ రాజన్ ఎస్ డీవోపీగా పని చేస్తుండగా, కాంతార ఫేమ్ అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

# వైవిధ్యంగా గామి మూవీ

## కథాకథనం కోసం దర్శకుడి ఆరాటం

విశ్వక్ సేన్  వైవిధ్యం వున్న పాత్రలను ఎంచుకుంటూ సినిమాలు చేస్తున్నారు. అలాంటి వైవిధ్యమున్న సినిమా 'గామి' అని విశ్వక్, చిత్ర నిర్వాహకులు చెబుతూ వస్తున్నారు. ఈ చిత్రానికి ప్రచారాలు కూడా విరివిగా చేశారు, ప్రచార చిత్రాలు చాలా ఆసక్తికరంగా కూడా వున్నాయి. ఈ సినిమా పూర్తి చేయడానికి సుమారు ఐదేళ్లు పట్టింది. ఈ సినిమాతో విద్యాధర కాగిత దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమా కోసమని ఎక్కడో హిమాలయాల్లో మంచు బాగా కురిసే ప్రాంతాల్లో షూటింగ్ చేయడం, కొన్నిసార్లు ప్రత్యేకమైన ఋతువులకోసం ఎదురుచూడటం వంటివి చేయడంతో సినిమా పూర్తి చేయడానికి చాలా కాలం పట్టిందని చెబుతున్నారు. ఇందులో విశ్వక్ సేన్ అఘోరా పాత్రలో కనపడనున్నారని ప్రచారాల్లో చెప్పారు. చాందిని చౌదరి కథానాయికగా నటించింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని థియేటర్లలోకి వచ్చింది. శంకర్ (విశ్వక్ సేన్) ఒక అఘోర, అతనికి మానవ స్పర్శ, అంటే ఇంకొక మానవుడిని ఎవర్ని ముట్టుకున్నా అతనికి అదొక రకమైన వ్యాధి వచ్చి చనిపోతాడు. శంకర్‌కి ఉన్న ఈ వ్యాధికి మందు హిమాలయాల్లోని త్రివేణి సంగమం దగ్గర ఉండే ఒక మొక్కలో ఆ ఔషధం ఉంటుందని, ఆ ఔషధం తీసుకుంటే శంకర్ వ్యాధి నయమవుతుందని స్వామీజీ చెప్తాడు. ఈ మొక్క కూడా 35 సంవత్సరాలకు ఒకసారి వస్తుందని.. ఆ సమయంలోనే ఆ మొక్కని తీసుకురావాలని చెప్తాడు. జాహ్నవి (చాందిని చౌదరి) ఒక డాక్టర్, రీసర్చ్ కోసం అదే ఔషధం కోసం ప్రయత్నం చేస్తుంది. శంకర్‌ని ఆ హిమాలయాలకి తీసుకువెళతానంటుంది. మరోవైపు దక్షిణ భారతదేశంలో ఒక గ్రామంలో దుర్గ అనే దేవదాసి తన కుమార్తె ఉమతో ఉంటుంది. ఆమెకు దేవదాసి నుండి తప్పించేస్తారు, కుమార్తెని దేవదాసిగా చేయాలని చూస్తారు. ఇంకోవైపు ఒక లేబరేటరీలో మనుషుల మీద వివిధ రకాలైన భయంకరమైన పరీక్షలు చేస్తూ ఉంటారు, అక్కడి నుండి ఒక అబ్బాయి తప్పించుకొని బయటపడతాడు. ఈ మూడు కథలు ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా జరుగుతూ ఉంటాయి. శంకర్‌కు ఆ ఔషధం తీసుకురావడంలో ఎదురైన పరిస్థితులు ఏంటి? చివరికి సాధించాడా? జాహ్నవి ఏమైంది? దేవదాసి కుమార్తె తప్పించుకొని ఎక్కడికి వెళ్లింది? బయటపడిన కుర్రాడు ఏమయ్యాడు? ఇవన్నీ 'గామి' సినిమాలో తెరకెక్కించారు. తెలుగు సినిమాలో ఒక వైవిధ్యమైన కథ చెప్పాలని, సినిమా అంటే వ్యాపార విలువలే కాకుండా ఒక మంచి కథ కూడా చెప్పాలని ఈ చిత్ర దర్శక నిర్మాతలు ప్రయత్నం చేసారు. ఇక తెరమీద ఒక్కో సన్నివేశం చాలా అద్భుతంగా కనిపిస్తూ ఉంటుంది. అందమైన ఆ మంచు ప్రదేశాలు, ఆ కొండలు, ఆ పర్వతాలు, ఔషధం కోసం శంకర్ పడే పాట్లు, సాహసాలు, సంఘటనలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. దర్శకుడు చాలా తెలివిగా కథనాన్ని అల్లుకున్నాడు. శంకర్‌కి ఎందుకు మానవ స్పర్శ తగలకూడదు.. తగిలితే ఏమవుతుంది అనే విషయాన్ని దర్శకుడు చివరివరకు ఆసక్తిగా కొనసాగించాడు. మరోవైపు గ్రామాల్లో జరిగే దేవదాసి సంప్రదాయం ఎంత కఠినంగా ఉంటుందో చూపించాడు. అలాగే మనుషుల మీద ప్రయోగాలు చేసే శాస్త్రవేత్తలు వాళ్ళ మధ్యలో కొంతమంది మనుషులు ఏ విధంగా నరకయాతన పడుతున్నారనేది చాలా బాగా చూపించాడు. ఈ సినిమాలో మాటలు తక్కువగానే ఉన్నప్పటికీ.. అవే చాలా ఆలోచింపజేసేలా ఉంటాయి.ప్రతి సన్నివేశం ఆసక్తికరంగా ఉందంటే అందుకు చాయాగ్రహణం చాలా ముఖ్యం చాలా బాగా చూపించారు. దానికి తోడు నేపథ్య సంగీతం బాగా తోడై సినిమా ఇంకో లెవెల్‌కి వెళ్లడానికి ఉపయోగ పడింది. వీటన్నింటిని జనరంజకంగా మలిచినందుకు దర్శకుడిని అభినందించాలి. ఇక నటీనటుల విషయానికి వస్తే విశ్వక్సేన్ శంకర్‌గా మంచి నటనను ప్రదర్శించాడీ సినిమాలో.  శంకర్ పాత్రలో మమేకం అయిపోయాడు. సినిమాలో మనకి నటులు గుర్తుకురారు పాత్రలే గుర్తుంటాయి. హీరోయిన్ చాందిని చౌదరి చాలా చక్కగా నటించింది. తెలుగమ్మాయిలు మంచి పాత్రలు వస్తే ప్రతిభ చూపిస్తారని చాందిని.. జాహ్నవి పాత్రలో నిరూపించింది. అభినయ దుర్గగా, ఉమగా వేసిన అమ్మాయి చాలా బాగా చేశారు. శంకర్ అనే ఒక అఘోర తనెవరో.. ఎక్కడి నుండి వచ్చాడో తెలుసుకోవాలని చేసే ప్రయాణంలో ఎదురైన భావోద్వేగ సంఘటనల ఆధారంగా మలచిన చిత్రం. ఆ లాబరేటరీ పరీక్షలవి ప్రేక్షకులకి అర్థం కాకపోవచ్చు. వాటిని పక్కన పెడితే.. వైవిధ్యం కోరుకునే తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమా ఖచ్చితంగా నచ్చుతుంది.



Edited,printed,published and Owned by sredharKancham  publication.D no.9/20a,main road.yadiki.515408, anantapuram.dist,RNI.Regn.no.Tel tel/2012/40975Email.maroudayamap@gmail.com